# మనిషి వేట

"వీడెవఁరా వెంటబెట్టుకు వచ్చావు మల్లన్నా !''

రంగయ్యనాయుడు తన స్వంత ఊరినుంచి వచ్చిన రైతు మల్లన్నను అడిగాడు.

"మన ఊళ్లో సూరమ్మ లేదండీ ! కోతలకూ కలుపుకూ వచ్చేది, దాని కొడుకండి. నాలుగు నెలలు జబ్బుపడి మొన్నరాత్రి చచ్చిపోయిందండి. నేను కనబడినప్పుడల్లా 'వీడిని అయ్యగారి దగ్గరికి తీసుకెళ్ళు, ఆరే ఆడి మంచిచెడ్డలు చూసి పెద్దవాడిని చేయాలని చెప్పు, నేను కూలిపని చేసుకుని బతికేదాన్ని. ఏపూట కాపూట కూలిపైసలతో వెళ్ళదీస్తున్నా, నేను పోయినంక ఆడి నెవరు చూస్తారు ? నీకా తల్లీదండ్రీ లేరు. మా అన్న నన్నెప్పుడో ఇంటినుంచి యెళ్ళగొట్టిండు. ఈడి బతుకెట్టా. అని నా ప్రాణం కొట్టుమిట్టాడుతున్నది. చిన్నాయనా, అయ్యగారితో చెప్పు' అని పేణం విడిచింది బాబయ్యా. అందుకని యెంటబెట్టుకొచ్చిన" అన్నాడు ఒంగి దణ్ణంపెడుతూ.

''ఇక్కడేం చేస్తాడురా వీడు ? తొమ్మిది పదేళ్ళు లేవూ ? ఎవరింట్లోనన్న పనికి కుదుర్చు" అన్నాడు రంగయ్యనాయుడు.

"ఏమో బాబయ్యా 'అంతా అరికెరక, ఈడిని సదివించ మందయ్య సూరమ్మ. తన ఆఖరికోరికగా చెప్పమంది" అన్నాడు రైతు మల్లన్న.

రంగయ్యనాయుడు మాటమారుస్తూ "ఈ ఏడు పంట బాగా వస్తుందటుం న్నారా మన ఊరివాళ్ళు ! వానలు బాగా పడినయ్ కదా ?" అని ప్రశ్నించాడు.

"ఆవాలు బాగా వచ్చినయ్. పైరు బాగా పెరుగుతా ఉంది. పంటకేం బంగారంలా పండుద్ది. మరి, సూరమ్మ చెప్పిందనే ఇక్కడికి యెంటబెట్టుకు వచ్చిన. ఈడిని సదివెయ్యమని........"

"ఇదిగో ! మల్లన్నా, కడుపున పుట్టిన నలుగురు మగపిల్లలు ముగ్గురాడ పిల్లలు ఎదుగుతున్నారు. పెళ్ళిళ్ళు పేరంటాలు కావాలి, మగపిల్లలలో ఇద్దరే చదువుతున్నారు. ఇది పెద్ద సంసారం. చూస్తున్నవు కద ? ఇంక వీడినెక్కడ చదివిస్త చెప్పు ? అయినా ఆ సూరమ్మ ఊళ్ళో నలుగురినీ అడుక్కొని కొడుకుని బతికించుకోవాలి గాని నా వెంటబడటమేమిటి ? దాని మాటలు నమ్మి నీవు వెంట బెట్టుకు రావటమేమిటి ? ఇంకా పొలంసంగతి చెప్పటానికి వచ్చావేమోననుకున్న" అన్నాడు.

రంగయ్యనాయుడికి పొలెంలో నలభయి ఎకరాల నల్లరేగడి భూమి ఉంది. ఆ ఊళ్ళో అందరికంటె అతడికే ఎక్కువభూమి ఉంది. రెండు మోటబావులున్నాయి. కొత్తగా బోర్‌వెల్ కూడా పెట్టించాడు. నీరు సమృద్ధిగా ఉంది. తండ్రి కాలంనాడు కట్టిన ఒక చిన్న పెంకుటిల్లు ఉంది. రంగయ్యనాయుడు తండ్రి కాలంలోనే పట్నంలో ఇల్లుకట్టుకుని కుటుంబంతో ఉంటున్నాడు. తండ్రి ఉండగానే ఇరవై ఏళ్ళ తమ్ముడు చనిపోతే అతడి భాగం కూడా కలిసి నలభైఎకరాలయింది.

తండ్రి ఉన్నంతవరకూ ఆయనే వరినాట్లకూ, కలుపుకూ, కోతలకూ వెళ్ళి పొలెంలోనే ఉండేవాడు. దగ్గరుండి పని చేయించేవాడు, నీరు పెట్టించేవాడు. కోతలయిన తరువాత వడ్లబస్తాలు బండ్లకెత్తించి పట్నం తోలుకుపోయి సగానికి పైగా అమ్మేవాడు. మళ్ళీ పొలెం వెళ్ళి, ఒక వర్షం పడగానే దున్నించి ఎరువులు వేసి, మళ్ళీ వరినాట్లకు భూమిని తయారు చేసేవాడు. ఎడ్లను చూసుకోవటం, మేతకు ఏర్పాట్లుచేయటం వంటి పనులు మల్లన్నకు వదిలిపెట్టేవాడు.

కాని, తండ్రి పోయిననాటినుంచీ పొలంపనులు రంగయ్యనాయుడే స్వయంగా చూసుకుంటున్నాడు. అతడు పొలెం వచ్చే ముందు ఇల్లు శుభ్రం చేయించి ఉంచేవాడు మల్లన్న. ఒక రైతు ఇంట్లోనుంచి భోజనం వచ్చే ఏర్పాటు చేసేవాడు.

అవి వరినాట్ల రోజులు. వరినాటటానికి ఆడకూలీలను పాతికమంది వరకూ పెట్టాడు మల్లన్న, నాట్లు వేసేటప్పుడు రంగయ్యనాయుడు ఒక చెట్టుకింద కుర్చీ వేసుకుని కూర్చునేవాడు. ఆ రోజు ఆడ కూలీలందరూ వచ్చారు. వాళ్ల నాట్లు

వేస్తుంటే రంగయ్యనాయుడు చూస్తున్నాడు. అందరిలోకి సూరమ్మ వయసులో చిన్నది. కాని, పని చురుకుగా చేస్తున్నది.

ఆ మధ్యాహ్నం రంగయ్యనాయుడు మల్లన్నను పిలిచి "ఈ చిన్నదాన్ని నాట్లకు పెట్టావు. కూలి మాత్రం పెద్దవాళ్ళతో సమానంగా ఇస్తున్నావు. ఎవరా పిల్ల ? ఎన్నేళ్ళనుంచీ వస్తున్నది ?" అడిగాడు.

"అయ్యా, ఆ పిల్ల తండ్రిపోయినాక అన్న మారిగాడు కూలికి పంపుతున్నాడు. అది కూలిపని చెయ్యకపోతే దానికాపొద్దు తిండిలేదు ఏడ్చుకుంట నాతానికి వచ్చింది. కూలిపనిలోకి రమ్మన్న. పిల్ల ఈడుకు చిన్నదేగాని పనిలో చురుకు. అందరిలోకి అదే బాగా చేస్తది. మనకు పని కావాలి గాని ఏళ్ళతోఏంపని బాబయ్యా ?" అన్నాడు.

రంగయ్యనాయుడు రెండు రోజులనుంచీ సూరమ్మను బాగా గమనిస్తున్నాడు. ఎర్రగా పొడుగ్గా ఉంటుంది సూరమ్మ. చేతికరపని తలవెంట్రుకలను గట్టిగా ముడిపెట్టుకుని, కాసంత బొట్టుపెట్టుకుని చీరె పైకెగ్గట్టి గబగబా నాట్లు వేసి పక్క కూలీల చేతిలోనుంచి మళ్ళీ కట్టలందుకుంటోంది. పదిహేడు పద్దెనిమిదేళ్ళ పిల్ల, నిగనిగలాడుతూ ఉంది. ఆ నడక ఉరుకులు పెట్టినట్టే ఉంటుంది.

కూలి వాళ్ళందరికీ కూలీ మల్లన్నే స్వయంగా రంగయ్యనాయుడి ముందర ఒక్కొక్కళ్ళనే పిలిచి ఇస్తున్నాడు. వాళ్ళు వెళ్ళేటప్పుడు కలుపుతీసే రోజుకు రమ్మని చెబుతున్నాడు.

"ఓ సూరమ్మా, మరిచిపోయేవు! వేళకు రావాలి" హెచ్చరించాడు మల్లన్న.

"నాను వేళకే వస్తగదయ్యా, గడియకూడా ఆలస్యం చెయ్యను. ఒదినెమ్మ కూడొండి పెట్టిపొమ్మంటది. వండకపోతే తిండిలేదు. అందుకని పొద్దుగల లేస్తగద. నాభయం నాకుంటది'' అన్నది సూరమ్మ.

"కాలం యెళ్ళదీసుకోవాల తల్లీ. మీ నాయనే ఉంటే లగ్గంచేసి పంపకపోయాడా ?" ఓదార్పుగా అన్నాడు మల్లన్న.

ఇదంతా రంగయ్యనాయుడు చూస్తున్నాడు, వింటున్నాడు. అతడా పాలెంలో ఇంకొకనెల ఉండవలసి వచ్చింది. ఇంకా దున్నవలసిన భూమి ఉన్నది.

ఎడ్లజతలు రెండు ముసలివైనాయి. మల్లన్న వీటిని అమ్మి కొత్తవి కొనమంటు న్నాడు. బేరాలు సాగుతున్నయి.

కలుపుతీసేరోజు రంగయ్యనాయుడు ఇంట్లోనే ఉన్నాడు. మల్లన్న అంద రినీ పనిమీదికి ఎక్కించి పారలకు కర్రలు వేయిస్తున్నాడు. 'గడ్డపారలు చరి పించాలి' తీసుకురమ్మన మని సూరమ్మను పంపించాడు.

పొలానికీ రంగయ్యనాయుడు ఉన్న ఇంటికీ నూరుగజాల దూరం ఉన్నది. సూరమ్మ పారలందించి గడ్డపారలకు మళ్ళీ వచ్చింది. అవి గదిలో మూలకు పడేసి ఉన్నాయి. వెలుతురు సరిగాలేదు, చీకట్లో చేతులతో వెతుకుతున్నది సూరమ్మ. ఇంతలోకే ఎవరో బలంగా ఒక చేత్తో నోరుమూసి ఆమెను అక్కడి నుంచి చావడిలోకి లాక్కుపోయారు. వాకిలి తలుపులు వేసి ఉన్నాయి. కిటికీలు ఎత్తుగా మీదికి ఉన్నాయి. మంచమ్మీదికి లాక్కుపోయి పెరటితలుపు గొళ్ళెం పెట్టాడు రంగయ్య.

సూరమ్మ బిత్తరపోయింది, ఏంచెయ్యటానికి తోచలేదు. రంగయ్యనాయుడు మీదిమీదికి వస్తున్నాడు. సూరమ్మ పెనుగులాడింది. కాళ్ళతో తన్నింది. చేతులతో తోసింది, అతడి ముందర ఆమెశక్తి ఎంత ? ఓడిపోయింది.

రంగయ్యనాయుడు వాకిటి అరుగుమీద కూర్చుని చుట్టకాల్చుకుంటున్నాడు.

"సూరమ్మా, గడ్డపారలు కానరాలేదూ ?" అరుస్తున్నాడు మల్లన్న.

సూరమ్మ పరిస్థితి అయోమయంగా ఉంది. ఏడుస్తూ కూర్చుంటే మల్లన్న లేచివస్తాడు. ఇంట్లో తెలిస్తే వెళ్ళగొడతారు. తనకెవరు తల్లా? తండ్రా? మల్లన్నే తండ్రిగా చూసుకుంటోంది. ఈ ఆసరా కూడా పోతే బతకలేదు, అతడే దిక్కు.

తల్లినీ, తండ్రినీ తలచుకుని కొంగుతో కళ్ళు ఒత్తుకుని, తల వెంట్రుకలు ముడిపెట్టుకుని, చీరె రైక సవరించుకుని గడ్డపారలు మోసుకుపోయింది.

"ఇంతసేపు చేసినవ్? కండ్లబడలే ?" మల్లన్న అడిగాడు.

"అవన్నీ మూలకేసినరు. చీకటి, నావేలు తలుపు సందులో పడి నలిగి పోయింది. చేత్తో పతుకులాడి తేచ్చేటేలకు ఆలీసమైంది చిన్నాయనా!" అంది తల వంచుకుని.

పాలెంలో పొలంపనులు చూసుకుని రంగయ్య నాయుడు పట్నం వెళ్ళాడు.

మల్లన్న సూరమ్మకు ఎక్కడో అక్కడ పని ఇప్పిస్తునే ఉన్నాడు. ఈసారి గొడ్లసావడి ఊడ్చి గొడ్లకు తాగటానికి గాబుల్లో నీరు నింపేపని ఇచ్చారు.

రెండు మూడు నెలలు గుట్టుగానే గడిచింది. మల్లన్న ఒంటరివాడు గనుక అక్కడే అతడికి వంటచేసి పెట్టేది.

సూరమ్మకు ఐదోనెల వచ్చేసరికి ఒదినే పసికట్టింది.

"ఏందమ్మాయ్? ఎట్లగో ఉన్నవ్? నీ విటువంటి పనులుచేసి మా కళ్లు కప్పుదామనుకున్నావ్? ఇంట్లో నుంచి బైటికెళ్లు" అని గొడవ చేసింది. అన్న యింటికి రాగానే ఇద్దరూ కలిసి ఆమెను ఇంటినుంచి వెళ్ళగొట్టారు. బావిలో పడ బోయిన సూరమ్మను బావి దగ్గర నిలబడి ఉన్న మల్లన్న చూసి "ఏందే ఈ అగాయిత్యం? ఏమయింది?" అంటూ ఒడ్డుకు తీసుకు వచ్చాడు.

సూరమ్మకు మల్లన్నను చూడగానే పట్టరాని దుఃఖం వచ్చింది. మల్లన్న తండ్రివంటివాడే. కాని ఈ మాట చెప్పటానికి గజగజ వణికింది ఏడుస్తూ.

"ఏం జరిగిందే? చెప్పు? బావిలో పడటానికి ఎందుకు వచ్చినవ్" కూర్చొబెట్టి అడిగాడు.

సూరమ్మ రంగయ్యనాయుడు చేసిన దౌర్జన్యమూ, అన్నా ఒదినెలు ఇంట్లో నుంచి వెళ్ళగొట్టటమూ, ముఖం మళ్ళీ చూపించవద్దనటమూ చెప్పుకుని ఏడ్చింది.

"చిన్నాయనా, నాకు బావికాక దిక్కేమిటి? ఎక్కడికి పోయేది? ఎవరు పిలుస్తారు?" అని గొల్లుమన్నది.

మల్లన్న మొదటి నుంచీ రంగయ్యనాయుడు ఆడకూలీలను ఆకలి చూపులతో చూడటం గమనిస్తునే ఉన్నాడు. కాని అతడు కూడా రంగయ్యనాయుడి జీతగాడు. అతడి బలమెంత? మిగతా ఆడకూలీలు కాస్త పెద్దవాళ్ళు. సూరమ్మ అశుభం తెలియనిది. అతడి చూపులను ఆమె గ్రహించుకోలేక పోయింది. ఒకవేళ గ్రహించినా అతడి చూపుపడ్డ తరువాత బలికావటం గతంలో అనేకసార్లు జరిగిన విషయాలు అందరికీ తెలిసినవే. గడ్డపారలకు లోపలికి పంపకపోయినా ఎప్పుడో చేత చిక్కించుకునేవాడే పాలెంలో అతడిని ఆపగలిగిన వాళ్ళులేరు.

"సూరమ్మ తల్లీ. నేను నిన్ను కాపాడలేని మూగజీవిని. నీ అన్నా ఒదినె ఇంట్లో నుంచి వెళ్ళగొట్టటం ఎప్పుడో జరుగుతుందనుకుంటనే ఉన్న నీ తండ్రి ఉంటే ఈ పాటికి నీకు లగ్గం చేసేవాడు. ఇప్పుడు నేను చేయగలిగింది ఒక్కటే గొడ్లపాకలో ఆ మూలగా తడక కడతాను అందులోఉండు నేను తడకవతల ఉంటాను." ఆమె తల ఊపుతుందా లేదా అని చూస్తూ.

''సరే చిన్నాయనా, నిన్ను కాదని ఎక్కడికిపోతా" అన్నది తలవంచుకుని.

"చూడు నీకు నెలలు వచ్చినాక ఒక ముసలిదాన్ని చూసి నీ దగ్గర పెడతా నీవు లేచినా లేవలేకపోయినా నిన్ను చూసుకుంటుంది. ఈ సంగతి పైకి పొక్క నీయకుండా చూస్తా."

సరేనని తల ఊపింది.

మంత్రసాని పనినేర్చిన ఆమె నొకదానిని తీసుకొచ్చి ఆమెదగ్గరుంచాడు.

నెలలు నిండే వరకూ సూరమ్మ తన కప్పగించిన పనులు చేస్తునే ఉన్నది. ఒక రాత్రివేళ పండంటి మగపిల్లవాడిని కన్నది. తెల్లవారి మల్లన్న పిల్లవాడిని చూసి ఆశ్చర్యపోయాడు. ఆ పిల్లవాడు తల్లినిపోలి పుట్టాడు. ముక్కు మూతి నొసలు గడ్డం సన్నగా పొడుగ్గాపుట్టాడు. చక్రాలవంటి కళ్లు. రంగయ్యనాయుడి బిడ్డే అయినా వాళ్ళల్లో కలవడు.

'చిన్నయనా. ఈడు బతికి బట్ట కట్టేనా? నేను చూస్తానా?" ఏడ్చింది.

"రాత్రి కన్నవు, పచ్చి బాలెంతవు. నీవు ఏడుస్తవెందుకు? చూడు పెద్దగయినాక సదూకుని, ఉద్యోగంచేసి నీ ముందర నిలబడతాడు. నా మాట అబద్ధంకాదు." సూరమ్మ నోదార్చి ఆమెకేమేమి మందులుకావాలో ఎటువంటి భోజనం పెట్టాలో ముసలమ్మనడిగి తెలుసుకుని తెచ్చాడు. వాసానికి బట్టఉయ్యాల కట్టాడు. తన పని చూసుకుంటూ తల్లీ పిల్లలను రోజుకు ఐదారుసార్లు చూసి పోయేవాడు.

మళ్ళీ కాతల సమయానికి కుప్పల మార్పిళ్ళప్పుడు రంగయ్యనాయుడు వస్తాడేమోనని భయపడ్డాడు. కాని వచ్చింది రంగయ్యనాయుడి పెద్ద కొడుకు. అతడు సిసలైన రైతుబిడ్డ. కోతలు కోయించి కుప్పలు నూర్పించి గడ్డిమేటి

వేయించి పనులన్నీ తండ్రి చెప్పినట్టు చేశాడు. మల్లన్న అతడికి తెలియనివి చెప్పితే వినేవాడు.

రంగయ్యనాయుడు ఇతడికి చదువు చెప్పించలేదు. ఇతడి పేరు సాంబయ్య ఎంతో గట్టిగా అరిస్తేగాని వినబడదు. కాని చెప్పినపని జాగ్రత్తగా చేస్తాడు.

అతడు వెళ్లేనాడు మల్లన్న బండి ఊరిమలుపు తిరిగేవరకూ సాగనంపాడు.

ఇంటికివచ్చి గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు.

అప్పటినుంచీ రంగయ్యనాయుడి బదులుగా సాంబయ్యే వస్తున్నాడు.

సూరమ్మ దొంగచాటుగా బ్రతికినట్టు బ్రతుకుతోంది. చూస్తూ ఉండగానే పిల్లవాడికి ఐదారేళ్ళు వచ్చినయ్.

"చిన్నాయనా, ఈడిబతుకు నా బతుకులా ఉండకూడదు. ఈడు సదూకోవాల ఏదైన ఉద్యోగం చెయ్యాల ఇక్కడుంటే పాడయిపోతాడు."

''సదివిస్తవా? ఇక్కడెవరు సదూ చెప్తరు సూరమ్మా. మన పాలెం పక్కన ఊళ్లో బడిచూసినకాని ఈడు అక్కడికి యెళ్ళగలడా?"

"ఎవరూ చూడకుండ దొంగచాటున నేను ఎత్తుకుపోత. బడి అయినంక ఎత్తుకు వస్త" అన్నది ఆశతో.

''రెండు కోసులు నడుస్తవా?''

"నడుస్త. ఈడికోసం ఎంతయిన కష్టపడత, కాని ఈ ఉళ్ళో ఈడు ఉండకూడదు అంతగా అయితే ఆ ఊళ్ళోనే నేను పనిచూస్కుంట. ఏమంటవు?"

"మాట మంచిగనే ఉందికాని- రోజులన్నీ అట్లగడవాలికద ? అక్కడ నీకుండే జాగ దొరకాల. పనికుదరాల. మంచి ఇరుగుపొరుగుఉండాల సూరమ్మా. అంతా అనుకున్నట్టు నడిస్తే బాగానే ఉంటుంది కాకపోతే ?"

''మరేంచెయ్యమంటావు చెప్పు ? ఈడిని మాత్రం ఇక్కడుండనీయద్దు." అన్నది ఖండితంగా.

సరే, నీమాట నాకెరకయింది. నీవుమాత్రం నాచాటుననే కొంతకాలం ఉండాల. నీచిన్నోడికి సదువంటున్నావు ? ఎట్లామరి ?"

"నీవే ఆలోచించు చిన్నాయనా. నాకేటి తెలుసుద్ది ?"

"సూరమ్మా, కొంచెం నామాట యినుకో. ఇంక రెండుమూడేళ్ళు పోనీయ్. ఇక్కడింతతింటాడు. తిరుగుతడు. ఏడెనిమిదేళ్ళు వచ్చినంక బడికి పక్క ఊరికి పంపిచ్చు. నీవులేకుండ ఎవరినైన తోడుచూసి నేను బడికిపంపే ఏర్పాటుచేస్తా. ఈలోగా నాలుగు పైసలు కూడేసుకో. ఆడికి బట్టలు పలక పొస్తకాలు కొందువు."

''పైసలు కూడెయ్యనా ? నీవిన్ని గింజలిస్తే ఆడికి అన్నంపెట్టి నేను గంజి తాగుతున్న. నాకిక్కడ పైసలెట్ల పుడతాయి ?"

"అదేనేననేది. ఆడిని ఒక్కడినే బడికిపంపే ఏర్పాటు చేసేవరకూ ఆగు. తొందరపడమాక."

సూరమ్మకెటూ తోచక సరేనన్నది. ఆ ఊళ్ళో అన్నఒదినె కండ్లపడ గూడదు. నలుగుర్లో తిరిగితే రంగయ్యనాయుడు చెవినపడుతుంది. తను ఇట్లనే చాటున బతకాల ఎంతకాలం ?

పక్కఊరినుంచి సైకిలుమీద పాలకోసం బక్కయ్య వస్తాడు పాలు బిందె లలో నింపుకుని సైకిలుకు కట్టుకుని ఊళ్లో అమ్ముకుంటాడు బక్కయ్య మల్లన్నకు బాగా తెలిసినవాడు మల్లన్న అతడికి అప్పులు యిస్తాడు. అతడిమీద నమ్మకం ఉంది. పిల్లవాడికి బసవన్న అని పేరు పెట్టింది సూరమ్మ చిన్నాయన సలహామీద. మల్లన్న ఒకరోజు ఒక చిన్నబడిలో బసవన్నను చేర్పివచ్చాడు. అన్నంపెట్టి, చద్దికట్టి బక్కయ్యతోకూడా పంపేవాడు. పంతులుకు పావుశేరు పాలు, నెలకు రెండురూపాయలు జీతం మాట్లాడేడు.

బసవన్న హుషారుగా బడికిపోయి పంతులుచెప్పింది నేర్చుకుని ఇంటికి వచ్చి తల్లికి చెప్పేవాడు. బసవన్నకు తొమ్మిదేళ్ళు వచ్చేవరకు పంతులు తనకొచ్చి నంత చదువుచెప్పాడు.

అటుతరువాత ?

మల్లన్న సూరమ్మకు తెలియకుండ బసవన్నను రంగయ్యనాయుడు దగ్గ రికి తీసుకెళ్ళి సూరమ్మకోరికను చెప్పాడు.

"అది చచ్చింది గద? పీడాపోయింది. ఈడికి సదువెందుకు? ఎక్కడైన పనికి కుదుర్చు"మని సలహాఇచ్చాడు రంగయ్యనాయుడు.

మల్లన్న ఊళ్లోఉన్న పెద్దబడిలో బసవన్నను చేర్చి పెద్దపంతులుకి వాడి సంగతంతా చెప్పి కాళ్ళమీద పడ్డాడు.

బసవన్నను ఎవరుచూసినా వాడి అదృష్టమేమోగాని కోరినసహాయం చేస్తునేఉన్నారు. ఆ బడిలో చౌకీదారు గదిలో బసవన్నకూడా ఉండే ఏర్పాటుచేసి పంతుళ్ళ యిళ్ళల్లో వారాలు కుదిర్చాడు పెద్దపంతులు. నెలవురోజున తల్లినిచూసి వచ్చేవాడు. పెద్దపంతులు పూర్ఫండులోనుంచి వాడికి రెండుజతల బట్టలు పుస్త కాలకు డబ్బు ఏర్పాటుచేశాడు. వాడికి గార్డియన్ మల్లన్న.

మల్లన్నకు ఒక్కటే కోరిక. తనకెవరూలేరు. ఈ సూరమ్మ తన తల్లి వంటిది. ఈ బసవన్న తన చివరిదశలో ఆదుకోవాలన్న కొండంతకోరిక. అదీకాక బిడ్డలు లేకపోవటంచేత సూరమ్మమీద కూతురిమీద ఉన్నంతప్రేమ మల్లన్నకు.

బసవన్నకు పన్నెండేళ్ళు వచ్చేసరికి చదువులో అందరికంటె ముందుండే వాడు. ఆటలలో ఆరితేరాడు. వ్యాయమశాలలోచేరి శరీరాన్ని బలిష్టంగా తయారు చేశాడు. వాడి అదృష్టంవల్ల పదిహేడేళ్ళకు మెట్రిక్ ప్యాసయ్యాడు. అతడిని చూడగానే కండలుతేలిన శరీరము, ఏదో ఆకర్షణ, చేరెడేసి కళ్ళు, చురుకైన మెదడు, చూడటానికి ఇరవైఏళ్ళ పిల్లవాడుగా కనబడతాడు.

ఏదోపనిమీద బజారుకు పోతున్నవాడు ఒకనాడు పోలీసుఇన్స్పెక్టరు కొడుకు సైకిలుకిందపడితే లేవదీసి దుమ్ముదులిపి వాళ్ళయింట్లో ఒప్పగించాడు బసవన్న.

ఇన్స్పెక్టరు మోహనరావు బసవన్నను కూర్చోపెట్టుకుని అతడి చరిత్రంతా అడిగి తెలుసుకున్నాడు.

"ఇంకముందు ఏంచెయ్యాలనుకుంటున్నావు?" అడిగాడు.

"మా అమ్మకు నేను గవర్నమెంటు ఉద్యోగం చెయ్యాలని ఉంది సర్. మా అమ్మ నాకోసం చాలా కష్టపడుతోంది. మాతాతకూడా కష్టపడుతున్నాడు. వాళ్ళకోరిక తీర్చాలికదా సర్.'' అన్నాడు.

"గవర్నమెంటు ఉద్యోగమంటే ఎటువంటిది కావాలి నీకు? పోలీసు ఉద్యోగ మిస్తే చేస్తావా ?" అన్నాడు.

"మాతాతనడిగి చెప్తానండి'' అన్నాడు.

మరునాడేవచ్చి మోహన్‌రావును కలిశాడు.

"ఏమన్నారు మీతాత అమ్మ ?" అడిగాడు ఇన్స్‌పెక్టరు.

"కోపం తెచ్చుకోకండయ్యగారూ. పోలీసు ఉద్యోగమంటే వాళ్ళకు భయ మట. అది మనకొద్దు. కావాలంటే ఇంకా చదువుకుని ఇంకేదయినా గవర్న మెంటు ఉద్యోగం చెయ్యమన్నారయ్యా." అన్నాడు తలవంచుకుని.

"ఎందుకని ? పోలీసు ఉద్యోగం మంచిదికాదా ? అధర్మాన్ని అన్యాయాన్ని శిక్షిస్తుంది. న్యాయానికీ ధర్మానికీ విజయాన్ని చేకూరుస్తుంది. అటువంటిది ఇష్టం లేదా ?"

"నిజానికంతేనయ్యగారూ కాని అందరూ అట్లలేరు అయ్యగారూ. ఇంకా కొన్నాళ్ళు చదువుకుంటా."

"పోనీలే నీయిష్టం. చదువుకోవాలని ఇష్టముంటే చదువుకో. ఎప్పుడైనా వస్తూండు." అని ఇరవైరూపాయలిచ్చి పంపాడు.

ఆ ఊళ్ళో కాలేజిలేదు. అక్కడికి పదిమైళ్ళదూరాన జూనియరు కాలేజి ఉంది. అక్కడికి బస్సుమీదపోవాలి. ధైర్యంగా వెళ్ళి చదువుతున్నాడు. అతడికి స్కాలర్‌షిప్పు వచ్చేవరకూ మల్లన్న డబ్బిస్తూఉండేవాడు. సెలవుల్లో మల్లన్నకు సహాయంగా అతడిపనులు చేసిపెట్టేవాడు. తీరిక ఉన్నప్పుడు తల్లిదగ్గరకూర్చుని తన చదువు సంగతులన్నీ చెప్పేవాడు. ఆమె సంబరపడిపోయేది.

బసవన్న అక్కడినుంచి అగ్రికల్చర్ కాలేజికి చేరుకుని అక్కడ పట్ట భద్రుడైనాడు. అతడికి అక్కడా అదృష్టం కలిసివచ్చింది. అతడి పరిస్థితులకు అనువైన స్కాలర్‌షిప్పు వచ్చింది. ఉచితంగా భోజనంపెట్టేహాస్టల్లో చేరాడు.

ఈలోపల రంగయ్యనాయుడు రెండుమూడుసార్లు వచ్చాడు. అతడు ఇద్ద రాడపిల్లలకు పెళ్ళిచేసేసరికి సగం పొలం ఖర్చయింది. ఆసందర్భంలోనే అతడు పాలెంవచ్చి బేరాలు చేసుకున్నాడు.

"మల్లన్నా" అని పిలిచాడొకనాడు.

మల్లన్న వచ్చి ఎదురుగా నిలబడ్డాడు.

"చాలా ఏళ్ళకింద ఒకపిల్లవాడిని తీసుకొచ్చావు ఆ పిల్లవాడేమయ్యాడు? తల్లి చచ్చిపోయిందన్నావుకదూ ?"

''అవునయ్య.''

"పిల్లవాడు ?"

"పొరుగూళ్లో పనికుదురుతానని వెళ్ళాడు. అక్కడే ఉండచ్చు."

"నీదగ్గర ఉంచుకోకపోయావా ?"

''నాదగ్గరా? నాకే వండి పెట్టేటోళ్ళులేరు. ఆడినెక్కడ ఉంచుకోగలుగుత?''

"ఇద్దరూ కలిసి ఎట్లానో తంటాలుపడితే ముందుకు నీకు అక్కరకొచ్చే వాడుకదా ?"

"ఎవరికీ పట్టనోడిని నేనుంచుకుని పెద్దగచేయగలనా ? ఇప్పుడేనాకు పని చేతనౌతలేదు."

''మల్లన్నా సగం పొలం పెళ్ళిళ్ళకు అమ్మాను. ఈ సగంతో సంసారం గడవదు. చేతికొచ్చిన పిల్లవాడొక్కడు లేడు. మన సాంబయ్యకు చెవులు అసలే వినరాకుండా అయినయ్. మగపిల్లలకు చదువంటటంలేదు. ఆకతాయిల్లా తిరుగుతున్నారు. ముందుకు ఇంకొకపిల్లకు పెళ్ళిచెయ్యాల. ఇంక నేను పట్నంలో ఉండలేను. ఆ యిల్లమ్మి పిల్లకు పెళ్ళిచేసి ఈ యింట్లోనే ఉండాలనుకుంటున్నా." అన్నాడు రంగయ్యనాయుడు.

"ఇక్కడుండగలరా అయ్యా, ఇల్లు చిన్నది. పట్నంలో ఉన్నట్టు ఇక్కడుంటదా ?"

"ఉండాలె. ఇంటిదానికి ఒళ్ళుబాగలేదు. పిల్ల అత్తగారింటికిపోతే వండిపెట్టేవాళ్ళులేరు. పెద్దవాడికి పెళ్ళిచెయ్యాలనుకున్న. పిల్లనిస్తామని ఎవరూ ముందుకు రావటంలేదు. ఏం తోచకుండఉంది."

"కష్టాలిట్లనే ఉంటాయి ? మళ్ళీ మంచిరోజులొస్తాయి బాబయ్యా.''

అన్నాడుగాని మల్లన్నకు గుండె గుభేలుమన్నది. సూరమ్మ ఇక్కడేఉంది. రంగయ్యనాయుడు ఈ పాలెంలోఉంటే ఎప్పుడైనా కనబడే అవకాశముంది. సూరమ్మ చనిపోయిందని చెప్పినందుకు తనను క్షమించడు. బసవన్నను బతక నీయడు, సెలవులలోవస్తే పట్టుబడతాడు.

ఇంకా మల్లన్న అపనమ్మకాలలోనుంచి పుట్టిన ఆశలతో 'గాలిలో దీపం పెట్టి దేవుడా నీమహిమ' అన్నట్టుగా అంచనాలు వేస్తున్నాడు.

ఈలోగా రంగయ్యనాయుడు మల్లన్నకు తెలియకుండా ఊరివాళ్ళలో ఒక డిని మంచిచేసుకుని సూరమ్మనుగురించి పుట్టినబిడ్డను గురించీ ఆరాలు తీస్తున్నాడు. పిల్లవాడు పక్కఊరిలో చదువుతున్నట్టుగా రూఢిగా తెలుసుకున్నాడు. కాని సూరమ్మ ఆ పాలెంలోనే ఎక్కడో ఉండవచ్చునని అనుమానంగా వార్తలు తెలి శాయి.

వీళ్ళిద్దరికీ ఇంత ఆసరా ఇచ్చినవాడు మల్లన్నేనని రంగయ్యనాయుడికి బాగా అర్థమయింది.

మల్లన్న తనచేతిలోవాడేనని రంగయ్యనాయుడు నమ్మాడు. పాలెమంతా గాలించినా సూరమ్మ కనబడని కారణమేమయి ఉంటుందన్న ఆలోచన అతడిని పీడిస్తున్నది.

ఒకవేళ కొడుకుదగ్గర ఉందా?

రంగయ్యనాయుడు పక్కఊరికి మనిషిని పంపించి పాలెంనుంచి వచ్చిన పిల్లవాడెవడైనా అక్కడ చదువుతున్నాడేమోనని ఆరాలు తీయించాడు.

"చదివినమాట నిజమేకాని- అతడు అక్కడినుంచివెళ్ళి చాలాఏళ్ళయిందని తెలిసింది.

కాని, ఎక్కడికి వెళ్ళినదీ ఆ స్కూలు యాజమాన్యానికి తెలియదన్న వార్త వచ్చింది.

"వీడికి చదువుకోవటానికి మల్లన్నే డబ్బిస్తున్నాడా? ఒకవేళ బసవన్న చదువుకుంటున్నా అక్కడికి సమీపంలోఉన్న ఊళ్లో ఉంటాడుకాని అంతకంటె దూరం పోగలడా? ఖర్చులెక్కువకదా!" రంగయ్యనాయుడు ఆలోచిస్తున్నాడు.

అయినా మల్లన్నమీద ఒకకన్నువేసి అతడు పడుకునేపాక సమీపంలో రాత్రిళ్ళు కాపలా కాస్తూ ఉండేవాడు. రెండుమూడుసార్లు 'మల్లన్న' అంటూ కేకలు పెట్టేవాడు.

"అయ్యా వస్తున్నా" అని మల్లన్న వేసే బదులు కేకతో తృప్తిచెందేవాడు రంగయ్యనాయుడు. ఐదునిమిషాలలో మల్లన్న "వచ్చిన బాబయ్యా" అంటూ కన బడగానే "నాకేదో పెద్దచప్పుడు వినవచ్చింది. బత్తెగొడ్డుగాని బావిలో పడిందేమో నని పిలిచాను" అంటూ తృప్తిగా జవాబిచ్చేవాడు.

ఒకటి రెండుసార్లుకాదు ప్రతిరోజూ మల్లన్నకు ఇటువంటి పిలుపులు వస్తున్నాయి.

ఒకరాత్రివేళ రంగయ్యనాయుడి పిలుపుకు వెళ్ళి హాజరయి "అయ్యా పొద్దుగల జ్వరం తగిలినట్టున్నది. ఒళ్ళు సోలిపోతున్నది. చాపమీద ఒరిగి తెల్ల వారకముందే వస్తనయ్యా" అని చెప్పి ఉన్న నాలుగుబట్టలూ ఇద్దరివీ మూటగట్టు కుని మెల్లగా అడుగులు వేసుకుంటూ పక్కఊరికి బయలుదేరాడు సూరమ్మతో. వాళ్ళు పాలెం చేరుకోబోతుండగా ఒక తుపాకీగుండు మల్లన్న కాలిపిక్కకు తగిలి పక్కకుపోయింది.

"సూరమ్మా శక్తికొద్దీ పరుగుతియ్యి. ఈ డబ్బుంచుకో. బట్టలమూట నెత్తిన పెట్టుకో"మని ఇచ్చాడు. సూరమ్మ చెట్లకిందనుంచి పరుగెత్తింది.

మల్లన్న పిక్కకు తగిలిన దెబ్బ చిన్నదికాదు. రక్తం కారుతున్నది. తను కట్టుకున్న పంచెలోనుంచి ఆ చీకటిలోనే ఇంత ముక్కచింపి గట్టిగా కాలికికట్టాడు. కాని వేగంగా పరుగెత్తలేకపోయాడు. అతడు ఒకమైలు అట్లా కుంటుతూ నడిచా డేమోగాని పరుగెత్తలేకపోయాడు. అంతలో నాలుగు కర్రదెబ్బలు తలమీద పడ్డాయి. కిందపడిపోయాడు. తలపగిలి రక్తం వరదలయింది.

మల్లన్న పడగా చూసినవాళ్ళు ఇంక ఎట్లాగూ బతకడని వెనక్కుమళ్ళారు.

సూరమ్మ వెనకనుంచి మల్లన్న వస్తున్నాడనే భ్రమతో ఊళ్లోకి వెళ్ళింది. అక్కడ బసవన్నలేడని తెలుసుకనుక పక్కఊరికి చేరుకుంది. అక్కడినుంచి బసవన్న వెళ్ళిపోయిన ఊరు తెలుసుకుని రైల్వేస్టేషనువరకూ పరుగెత్తింది. ముందు రైలు వస్తున్నదని చూసుకోకుండా పట్టాలు దాటబోయింది.

పాలెంనుంచి ఒక ఏకాలినడకతో పరుగెత్తి పరుగెత్తి అలసిపోయిన సూరమ్మ కాళ్ళు తడబడ్డాయి. రైలు సమీపిస్తుంటే ఏంచెయ్యాలో తోచక పట్టాలు మధ్యగా పరుగెత్తింది.

సూరమ్మ పలాయనం ఆ ఇంజన్‌కేం తెలుసు? అడ్డం వచ్చిందని ఆగకుండా ముందుకు ఏడెనిమిది గజాలువెళ్ళి అక్కడ ఆగింది. బోర్లాపడ్డ సూరమ్మ బుజాలవరకు పట్టాల అవతల పడ్డది. మిగతాభాగం మాంసంముద్ద అయింది. రంగయ్యనాయుడు మనిషివేట ఇంకా పూర్తికాలేదు. బసవన్నకొరకు గాలిస్తున్నాడు. బసవన్నకు స్కాలర్‌షిప్పు వచ్చింది. విదేశాలకు బయలుదేరాడు.